క్లుప్తంగా

అయోధ్య శ్రీరాముని అక్షింతల పంపిణీ



పమిడిముక్కల: వీరంకిలాకులో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం అయోధ్య రాముని అక్షింతలు ఇంటింటికీ అందజేశారు. దేశంలోని ప్రతి హిందూ కుటుంబానికి అయోధ్య రాముని ఆశీస్సులు అందించాలని అయోధ్య రామాలయ ట్రస్ట్ వారు పంపించిన అక్షింతలను ప్రజలకు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చెక్కా ఆంజనేయులు, గంజాల నరేంద్ర, కాగిత వినయ్, భవిరిశెట్టి నాగేంద్ర, బాలాజీ, జయబాల తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గుడివాడరూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అనగాని వెంకటరమణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 8వ తేది సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ గద్దే పుష్పరాణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, సభ్యులు, మండలస్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె కోరారు. సమావేశంలో మండలంలో ఉన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి చర్చ ఉంటుందని, ఆయా శాఖల అధికారులు అన్ని వివరాలతో సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

పేదల చెంతకే సంక్షేమ పథకాలు



పమిడిముక్కల: పేదల చెంతకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు తెలిపారు. మంటాడ శివారు రెడ్డిపాలెంలో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ మూడువేలకు పెంచడం జరిగిందన్నారు. సచివాలయ కన్వీనర్ దారపు రమాదేవి, పార్టీ నాయకులు నీలాపు కనకయ్య, సూరి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లి పింఛను అందజేత



పమిడిముక్కల: మండలంలోని మామిళ్లపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మట్టా ఎల్లమ్మ అనారోగ్యంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వలంటీర్ దేవకరుణ ఆదివారం విజయవాడ వెళ్లి ఎల్లమ్మకు పెన్షన్ మూడు వేలు అందజేశారు. వృద్ధురాలు ఎల్లమ్మకు ఖర్చులకు ఉపయోగపడతాయని విజయవాడ వెళ్లి పింఛను అందజేసినట్లు దేవకరుణ తెలిపారు. పింఛన్ నగదు పెంచి తమ వద్దకే వచ్చి ఇచ్చేలా వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసిన సీఎం జగన్‌కు ఎల్లమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

గతం ఎంతో మధురం



గురువులతో టౌన్‌హైస్కూల్ పూర్వ విద్యార్థులు



మండవల్లి హైస్కూల్‌లో 1995-96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

- పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం
- ఆటపాటలతో అలరించిన పూర్వ విద్యార్థులు
- గురువులకు సన్మానం

గుడివాడరూరల్: ఏరా..ఏం చేస్తున్నావు...ఎలా ఉన్నావు.. ఎక్కడ ఉంటున్నావు.. అని తోటి విద్యార్థులు, మాస్టారు బాగున్నారా అని గురువుల్ని అప్యాయంగా శిష్యుల పలకరింపులతో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక అద్యంతం ఉత్సాహంగా కొనసాగింది. 24 ఏళ్ల క్రితం పదో తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు, వారికి విద్యాబోధన చేసిన గురువుల అపూర్వ సమ్మేళనానికి అడుసుమిల్లి రామకృష్ణయ్య (టౌన్ హైస్కూల్) మున్సిపల్ ఉన్నత పాఠశాల వేదికైంది. 1999–2000 పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని పాఠశాలలో కలుసుకున్నారు. విద్యార్థులు అలనాటి తీపి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఆటపాటలతో అపూర్వ కలయికకు వన్నె తెచ్చారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు దోహదపడిన గురువులకు పాదాభివందనాలు చేసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఒకరికి ఒకరు యోగ క్షేమాలు తెలుసుకున్నారు. కొందరు తమ పిల్లలతో, మరికొందరు జీవిత సహచరులతో సమ్మేళనానికి విచ్చేయటంతో పాఠశాల ఆవరణ అంతా పండుగ వాతావరణంగా మారింది. 24 ఏళ్ల తర్వాత కలిసి, తిరిగి విడిపోతున్నామనే బాధ వారిలో కనిపించింది. ప్రతి ఏడాది ఏదో ఒక సందర్భంలోనైనా అందరూ కలవాలనే సంకల్పం కనిపించింది. అనంతరం పూర్వ విద్యార్థులు గురువులు ఎస్ఎస్‌వీఆర్, శ్రీనివాసరావు, ముక్తేశ్వరరావు, చిన్న వెంకట్రావ్‌లను ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మండవల్లిలో 1995–96 పదో తరగతి బ్యాచ్

మండవల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1995–96 సంవత్సర 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని, ఆనాటి రోజుల్లో వారు చేసిన చిలిపి చేష్టలను గుర్తుకు తెచ్చుకుని ఆనందోత్సాహాలతో గడిపారు. తాము చదివిన పాఠశాల అభివృద్ధికి రూ.25 వేలు విలువగల ఐరన్ బీరువాను బహూకరించారు. తమ గురువులు కే సూర్యారావు, ఎల్ఎస్ భాస్కరరావు, కె.షరీఫ్, జానకీరామారావు, ఏకే మహలక్ష్మి, కొండలరావు, అట్లూరి వెంకటేశ్వరరావు, ప్రస్తుత హెచ్ఎం పీవీఎస్ఎస్‌జీ ప్రసాద్‌లను దుశ్శాలువా కప్పి సత్కరించారు. అందరి చిరునామాలు సేకరించి ఒకేచోట కలుసుకోవడానికి కృషి చేసిన గణేష్, షంషీర్‌ఖాన్, వెంకటేష్, సురేష్, రమేష్, శ్రీనివాసరావు, రత్నారావు, కుమార్, వెంకటేశ్వరరావులను ఈ సందర్భంగా అభినందించారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుదాం

జిల్లా అధ్యక్షుడు చింతలూరి సత్యనారాయణ



'తీయని బంధం' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న చింతలూరి, బసుధ

గుడివాడరూరల్: విశ్వకర్మ బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుదామని విశ్వకర్మ బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చింతలూరి సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో విశ్వకర్మ బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న చింతలూరి మాట్లాడుతూ రానున్న కాలంలో మంచి లక్ష్యాలతో సంఘం ఆధ్వర్యంలో అందరం కలసి ముందుకు సాగుదామన్నారు. పలు సేవా, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించేందుకు సంఘ సభ్యులు కృషి చేయాలని ఆయన కోరారు. గుడివాడ పట్టణంలో నూతనంగా సంఘంలోకి వచ్చిన సభ్యులు సభ్యత్వం స్వీకరించాలన్నారు. పట్టణ అధ్యక్షుడు వసుధ బసవేశ్వరరావు రచించిన తీయని బంధం గ్రంధాన్ని ఆయన ఆవిష్కరించారు. సంఘ సభ్యులు డాక్టర్ పుల్లేటికుర్తి శ్రీనుబాబు, సీబీఎస్‌వీ ప్రసాద్, వంగివరపు వీరరాఘవాచారి, కృష్ణకిషోర్, రాజారావులు పాల్గొన్నారు. కాగా సంఘ నూతన కార్యదర్శిగా విశ్రాంత ఉపాధ్యాయుడు పీబీఎస్‌శీ ప్రసాద్‌ను సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సాహితీ రంగంలో ఇటీవల పలు పురస్కారాలు అందుకున్న సభ్యులు వసుధ, శ్రీనుబాబులను ఘనంగా సత్కరించి సన్మానించారు. తొలుత ఇటీవల మృతి చెందిన పలువురు సంఘ సభ్యులకు నివాళులర్పించారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

సీఐ కిషోర్‌బాబు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కిషోర్‌బాబు

పమిడిముక్కల: సత్ప్రవర్తన కలిగి ఉండాలని, చట్టవ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనవద్దని పమిడిముక్కల సీఐ ఎం.కిషోర్‌బాబు రౌడీషీటర్లకు సూచించారు. పమిడిముక్కల సర్కిల్ పరిధిలోని పమిడిముక్కల, తోట్లవల్లూరు మండలాల్లోని రౌడీషీటర్లకు సీఐ కిషోర్‌బాబు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో భాగంగా షీటర్లకు పలు సూచనలు, జాగ్రత్తలు తెలియజేశారు. అసాంఘిక కార్యకలాపాలకు, సంఘ విద్రోహ చర్యలకు పాల్పడవద్దని తెలిపారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు కిషోర్‌కుమార్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు

జమీగొల్వేపల్లి(పామర్రు): మండల పరిధి జమీగొల్వేపల్లి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసం పూజలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైఖానస సంప్రదాయం ప్రకారం ఆలయంలో తెల్లవారు జామున బిందె తీర్థం తెచ్చి దానితో స్వామివారిని అభిషేకం చేశారు. అనంతరం గోదా దేవి సహిత రంగనాథ స్వామివారికి శత సహస్ర నామాలతో ఆలయ అర్చకులు వేదాంతం తిరుమలాచార్యులు విశేషంగా పూజ చేశారు. నివేదనలు చేసిన తర్వాత భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. మండల పరిధిలోని జమీదగ్గుమిల్లి, రాపర్ల, నిమ్మకూరు, పెరిశేపల్లి, కనుమూరు, కురుమద్దాలి గ్రామాల్లోని వైష్ణవ ఆలయాల్లో ఘనంగా ధనుర్మాస పూజలను చేశారు.

సత్యదేవునికి ధనుర్మాస ఉత్సవాలు..

గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీమన్నారాయణ అష్టాక్షరి మహా మంత్ర లిఖిత జప ఏగణం వేద పండితులు నిర్వహించారు. తొలుత స్వామివారికి విశేష ద్రవ్యాలతో స్నాపన తిరువంజనం, శ్రీమన్నారాయణ అష్టాక్షరి హోమం, ప్రత్యేక పూజలను పండితుడు రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కలుపు నివారణ చర్యలు చేపట్టాలి

పామర్రు: మినుము సాగులో ప్రస్తుతం ఉన్న కలుపు, ఊదా, బంగారు తీగలను తొలగిస్తే మంచి దిగుబడులు సాధించ వచ్చునని వ్యవసాయశాఖ అధికారులు తెలుపుతున్నారు. మండల పరిధిలో సుమారు 23.500 ఎకరాల్లో మినుము సాగు చేస్తున్నారు. ఈ నేపధ్యంలో మినుము పంటలో కలుపు, ఊదా, బంగారు తీగ తదితరాలు దర్శనమిస్తున్నాయి. కలుపు, ఊదాల నివారణకు విప్ సూపర్ 250 మిల్లీలీటర్లు లేదా టర్గా సూపర్ 400 మిల్లీలీటర్ల వాడితే మంచి ఫలితం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు తెలుపుతున్నారు. సాగులో బంగారుతీగ అధికంగా ఉన్నట్లు గమనించామన్నారు. దీని నివారణకు పరచూట్‌ను ఒక లీటరుని 5 ఎకరాల విస్తీర్ణంలో చల్లాలన్నారు. సాగులో అక్కడక్కడ దురదగుంట ఆకులు వస్తున్నాయని వీటి నివారణకు ఇమజితఫిర్ మందును 1లీటరును 5ఎకరాలలో పిచికారి చేయాలని సూచిస్తున్నారు. రైతులు తమ మినుము పొలాలలో మందులను పిచికారి చేస్తున్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



క్రీడాకారులతో ఏఎంసీ చైర్మన్ వీర్రాజు

మండవల్లి: యువత క్రీడల్లో నైపుణ్యం సాధించాలని ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు అన్నారు. మండలంలోని లింగాలసచివాలయం వద్ద 'ఆడుదాం ఆంధ్రా' క్రీడాకారులకు ప్రభుత్వం సరఫరా చేసిన దుస్తులను చైర్మన్ ఆదివారం పంపిణీ చేశారు. వీర్రాజు మాట్లాడుతూ విద్యార్థులు సద్వినియోగం చేసుకుని రాష్ట్రానికి ఖ్యాతి తెచ్చేవిధంగా, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని కోరారు. ఎంపీటీసీ కమదన నాయన బాబు, వ్యవసాయ సలహామండలి జంగం రామదాసు, శివాలయ చైర్మన్ రాజులపాటి యశోదనరావు, సొసైటీ అధ్యక్షుడు గరికపాటి రామ్మోహనరావు, డైరెక్టర్ ఓలేటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ పెడసనగంటి కనకాచారి, బోయిన పద్మారావు, ఒలేటి నాగరాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తులసీ దళార్చన



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత రాజగోపాల స్వామి ఆలయంలో ధనుర్మాస ఏకాదశిని పురస్కరించుకుని లక్ష తులసీదళార్చన అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేకువ జామున ధనుర్మాస పూజ, స్వామివారికి పంచామృత అభిషేకం, లక్షతులసీ దళార్చన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సావాన్ని ఉత్సాహవాతావరణంలో జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కూచిపూడి, పెదపూడి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

కొండలమ్మకు మొక్కుబడుల చెల్లింపు



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులను చెల్లించుకునేందుకు ఆలయంలో క్యూలైనుల్లో భక్తులు అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

జూదరులపై కేసు నమోదు

మండవల్లి: అయ్యవారిరుద్రవరంలో ఆరుగురి జూదరులపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్ఎస్ రామచంద్రరావు పేర్కొన్నారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి అయ్యవారిరుద్రవరం డొంకలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.5,500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. పోలీసు స్టేషన్‌కు తీసుకు వచ్చి వారిపై 9(1) ఏపీ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి నోటీసులు ఇచ్చామని, సొంత పూచికత్తుపై వారిని విడుదల చేశామని తెలిపారు.

రిటైర్డ్ వీఆర్వో మృతి



మాజీ వీఆర్వో ఇశ్రాయేలు

మండవల్లి: నందిగామలంక మాజీ వీఆర్వో కొత్తపల్లి ఇశ్రాయేలు (75) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈయన 32 సంవత్సరాలు 14 గ్రామాల్లో వీఆర్వోగా విధులు నిర్వహించారు. ఇశ్రాయేలు మృతి పట్ల పలువురు రెవెన్యూ అధికారులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

పార్టీ అభివృద్ధికి ఐక్యంగా పనిచేయండి

- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం



వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: స్థానిక మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న కొబ్బరి తోటలో నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పామర్రు శాసన సభ్యులు కైలే అనిల్‌కుమార్ పాల్గొన్నారు. తొలుత దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను గ్రామ గ్రామాన తీసుకువెళ్లి ప్రజల నుంచి పార్టీ మద్దతు కోరాలని అన్నారు. ప్రభుత్వం నిర్వహించే సంక్షేమ కార్యక్రమాల లబ్ధిదారులు ఇంకా ఎవరైనా ఉంటే గుర్తించి వారికి పథకాలు అందించేలా తగు చర్యలు తీసుకోవాల న్నారు. నియోజకవర్గంలోని ఐదుమండలాల్లో ఉన్న 106 గ్రామాల్లో పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు కలిసి కట్టుగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నియోజకవర్గలలో ప్రజా ప్రతినిధులు, పార్టీనాయకులు కార్యకర్తలు అభిమానులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రాకార మండపం నిర్మాణ పనుల పరిశీలన

కలిదిండి: పాతాళ భోగేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న ప్రాకార మండపం నిర్మాణ పనులు శివరాత్రికి ముందుగానే పూర్తి చేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) తెలిపారు. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం ప్రాకార మండపం నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, పీఏసీఎస్ అధ్యక్షుడు వడుపు రామారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ నీలపాల వెంకటేశ్వరరావు, చిట్టూరి బుజ్జి, మంగినేని భాస్కరరావు, మారుబోయిన విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు లక్ష తులసి పూజ

కైకలూరు: ధనుర్మాసం సందర్భంగా స్థానిక భూసమేతవేంకటేశ్వరస్వామి(మీసాలవెంకన్న)కి లక్ష తులసి పూజవైభవోపేతంగా ఆదివారం జరిగింది. గతేడాది డిసెంబరు 17 నుంచి జరుగుతున్న ధనుర్మాసంలో భాగంగా వైఖానస ఆగమోక్త ఏకాదశిని పురష్కరించుకుని లక్ష తులసి పూజ చేశారు. ఈవో వీఎన్‌కే.శేఖర్, దర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రూ.4 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభించిన నాయకులు

గుడ్లవల్లేరు: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) కృషితో గుడ్లవల్లేరు, గుడివాడ రూరల్ మండలాల్లో రూ.4కోట్ల ప్రభుత్వ నిధులతో మూడు బీటీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ రోడ్లకు ఆదివారం కూచికాయలపూడిలో పనులను ప్రారంభించారు. తొలి విడతగా పాత మల్లాయిపాలెం–మోటూరుకు రూ.1.2 కోట్లతో 2.2 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం జరుగుతుందని ఆర్ అండ్ బీ డీఈ ఇ.కామేశ్వరరావు, ఏఈ శ్రీనివాసరరావు పేర్కొన్నారు. రెండో విడతగా కూచికాయలపూడి–విన్నకోట రోడ్డు, పోలిమెట్ల– అంగలూరు చెరువు వరకూ రూ.2కోట్ల నిధులతో 4.4 కిలోమీటర్ల వరకూ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు చెప్పారు. జేమ్స్‌పేట–కట్టవానిచెరువు–చినగొన్నూరు రోడ్డు రూ.80 లక్షల నిధులతో 2.2 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులను అతి త్వరలో ప్రారంభించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కొడాలి సురేష్, మాజీ ఎంపీపీ కోగంటి ధనుంజయ, సర్పంచులు కొత్తూరి లక్ష్మీనారాయణ, అడుసుమిల్లి సత్యనారాయణ, కోటప్రోలు నాగు తదితర వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకర్ ప్రారంభం



తాగునీటి ట్యాంకర్ ప్రారంభిస్తున్న, ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ వెంకటరమణ

మండవల్లి: మండలంలోని ఇంగిలిపాకలంకలో మోరు రాజవర్దన్ జ్ఞాపకార్థం ఉచిత మంచినీటి ట్యాంకర్‌ను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఆదివారం ప్రారంభించారు.

ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము), జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, మల్లికార్జునరావు, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, మెండా సురేష్, ఘంటసాల సంపత్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం



శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు, పక్కన డీఎస్పీ శ్రీకాంత్, సేవాసంస్థ ప్రతినిధులు

గుడివాడరూరల్: స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని గుడివాడ డీఎస్పీపి.శ్రీకాంత్ పేర్కొన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని డీఎస్పీ ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. సెంటిని హాస్పటల్, మణిపాల్ హాస్పటల్(విజయవాడ)ల వైద్యులు కాగిత కృష్ణచంద్, కాట్రగడ్డ హరీష్, గంటా పావని, సెంటినీ హాస్పటల్ పీఆర్వో టి.సత్యనారాయణలు ప్రజలకు కీళ్ల, నరాలకు సంబంధించిన వ్యాధులతో పాటు ఈసీజీ, ఈసీవో టెస్టులను నిర్వహించారు. స్త్రీలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డీఎస్పీ శ్రీకాంత్ ఇలాంటి మంచి కార్యక్రమాలు మరిన్ని చేయాలని ఆకాంక్షించారు. మానవతా సంస్థ మహిళా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి, ఉమ్మడి కృష్ణ మానవతా అధ్యక్షుడు పాట్లూరి వీరశేషగిరిరావు, గుడివాడ సంస్థ చైర్మన్ ఉప్పలపాటి మారుతీప్రసాద్, పిన్నమనేనివేణుగోపాలరావు, మానవతా సభ్యులు, దోనేపూడి సరస్వతి, అన్నపురెడ్డి గోపిరెడ్డి లత పాల్గొన్నారు. 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు మహిళా అధ్యక్షురాలు దండమూడి తెలిపారు.